
# లోభిహృదయం

పెద్దబజారు కిటకిటలాడుతూంది. ఎండకు తట్టుకోలేని జనం మెల్లగా అంగళ్లలో జొరబడి సామాన్లు కొనకపోయినా బేరం చేసే మిషతో కాసేపు నీడన నిలబడుతున్నారు. పానకాలుశెట్టి చలివేంద్రంలోని మంచినీళ్ళ పీపాలకు పీపాలు ఖాళీ అయిపోయినాయి. ప్రక్కనేవున్న కనకాలశెట్టి చిల్లర దుకాణంకూడా కిటకిటలాడుతోంది బేరగాళ్ళతో. బొమ్మలకొలువులో పెద్దబొమ్మలాగా పట్టెనామాలు పెట్టుకొని కూర్చొని శెట్టి హడావుడిగా పొట్లాలుకట్టి వచ్చిన వాళ్ళకు యిస్తున్నాడు. పదేళ్ళ పిల్ల మాత్రం ప్రొద్దుట్నుంచి కనకాలుశెట్టి అంగడి గుంజ కానుకొని అలాగే నిలబడ్డది. పాలిపోయిన ముఖం — ముఖంమీదా, కళ్ళమీద పడే జుట్టు — లోతుకుపోయిన కండ్లు. ఆ పిల్ల సాక్షాత్కరించిన దుఃఖ దేవతలాగుంది. తదేక ధ్యానంతో శెట్టివైపే చూస్తూ శెట్టికి ఎప్పుడు దయకలుగుతుందా అని నిరీక్షిస్తున్నాయి ఆపిల్ల కండ్లు. కనకాలుశెట్టి మాత్రం ఆపిల్లవైపు కన్నెత్తికూడా చూడకుండా తన వ్యాపారంలో నిమగ్నుడై వున్నాడు. కాని ఆపిల్ల అంత సేపట్నుంచీ అలాగే నుంచోవడం శెట్టికి ఒళ్ళు మంటగానే ఉంది. ఎన్ని తడవలు చెప్పినా తనమాట లక్ష్యపెట్టకుండా అక్కడనుంచి కదలనంటుందేం! "నీకేగదమ్మాయ్ చెప్పేది! వినిపించడంలా. ఫో....ఫో....మీ నాన్న డబ్బు పంపినప్పుడే తీసుకురా. అప్పుడే సరకు లిస్తానని మీ అవ్వతో చెప్పు, ఫో....అని కసిరాడు. పదేళ్ళ పిల్ల అతని మాటలకు చలనం లేకుండా ప్రతిమలాగా అలాగే నిలుచుంది. ఝాము ప్రొద్దెక్కింది....శెట్టి దుకాణానికి వచ్చే జనం పల్చబడ్డారు....భోజనానికి లేచాడు శెట్టి. యింకా పిల్ల అలాగే అక్కడే వుంది. శెట్టికి ఈసారి విపరీతంగా ఒళ్ళు తెలీని కోపం వచ్చింది. చేతులోనున్న తువ్వాలు ఝళిపించుతూ "ఏయ్! అమ్మాయ్! వెడతావాలేదా! శనిగ్రహంలా పట్టుకున్నావేం! పోతావా మెడబట్టి గెంటమంటవా? నోరులేని పిల్ల విగదా అని చూస్తుంటే మొండికి పడతావా. కదులు ముందు ఇక్కడనుంచి ఊ! యిందా, నీ పలక తీసుకుపో" అని పలక ఆ పిల్ల ముందు ఎత్తి పడేశాడు ... మెట్లమీదపడ్డ పలక బద్దలయింది . .. శెట్టి....గా....రూ....సేరు.... బియ్యం ... పుణ్యం...నాలుగు ... పస్తు నోరులేని పిల్ల ముఖం...యివ్వండి" అని అవ్వ రాసిచ్చిన అక్షరాలు పలక ముక్కల్లో చిందరవందర అయ్యాయి. పదేళ్ళ పిల్లకి దుఃఖం పొంగుకొచ్చింది. రెండేళ్ళనాడు ఆ పలకను శెట్టే ఆపిల్ల కిచ్చాడు ధర్మంగా. సరుకులు కొంటానికి వచ్చినప్పుడు ఆ పిల్ల మూగభాష అర్థంకాక శెట్టి ఒకరోజు ఆ పలక యిచ్చి ఏం కావాలో ఇంట్లో అవ్వచేత వ్రాయించుకు రమ్మని ఒక బలపంకూడా యిచ్చాడు. అప్పట్నుంచీ ఆ పిల్ల పలకను తన ప్రాణప్రదంగా కాపాడుకొంటుంది. ఆ పిల్ల పలుకు ఆ పలకే! తనేం చెప్పాలన్నా అవ్వచేత పలకమీద వ్రాయించుకొచ్చేది. బడికిపోయే అదృష్టం ఆ పిల్లకి లేకపోయినా, రోజూ ఆ పలక చేత పట్టుకొని శెట్టి అంగడికి వచ్చి కాణీ బోణీచేసి యింటికి కావల్సిన వెచ్చాలు అవ్వ పలకమీద రాసిచ్చినవి పట్టుకెళుతుంటుంది. అవ్వ డబ్బిస్తే తెచ్చి శెట్టికిచ్చి పలక చూపేది. శెట్టి నవ్వుతూ సరుకులు పొట్లాలు కట్టి చిన్న బుట్టలో పెట్టి నెత్తిమీద పెట్టేవాడు. ఆ పిల్ల వెళ్ళొస్తానని మూగభాషలో చెప్పి పలక పుచ్చుకొని, బుట్ట తలమీద పెట్టుకొని వెళ్ళేది. ఈవిధంగా రెండు సంవత్సరాల నుండి జరుగుతోంది. యీసారి డబ్బు యివ్వలేదు. ఆ నోరులేని పిల్లకు ఎందుకివ్వలేదో ఏం తెలుసు. అవ్వ ఎప్పుడూ యిచ్చేది ఈసారి ఎందుకివ్వలేకపోయిందో. ఆ పిల్లకు తెలిసిన మూగభాష "లేదు" అని. అదే శెట్టితో చెప్పింది తన భాషలో. శెట్టికి తన భాష అర్థం అయినాకూడా కనికరం లేకుండా కసురుకున్నాడు...అంతేకాకుండా తన పలక క్రింద పడేసి పగులగొట్టాడు. పదేళ్ళ పిల్లకి దుఃఖం ఆగిందికాదు. లంగాతో కళ్ళు తుడుచుకుంటూ పలక ముక్కల్ని ఏరి వాళ్ళో వేసుకుంది. శెట్టి రాక్షసుడిలాగ గుడ్లు పెద్దవిచేసి ఇంకా


భానుమతీ రామకృష్ణ



పోవేం ? అన్నట్లు చూస్తున్నాడు నుంచోని. ఆ పిల్లకి శెట్టిని కళ్ళెత్తి చూసే ధైర్యం లేకపోయింది. భయంతోనూ అవమానంతోనూ ఆ మూగ చిన్ని హృదయం తల్లడిల్లిపోయింది.

కళ్ళనిండా నీళ్ళనిలిచాయి. ఆకలితో ఆ పిల్ల కళ్ళు ఆ నీళ్ళు తాగేశాయి. ప్రొద్దుట్నుంచీ నిలబడ్డదేమో కాళ్ళు వొణికాయి. ఇక అక్కడుంటే శెట్టి కొడతాడేమోనని శక్తిలేకపోయినా ఆ పిల్ల లేనిబలం తెచ్చుకొని క్షణం కూడ అక్కడ నిలవకుండా మెరుపులాగ పరుగెత్తి పోయింది.... శెట్టి ఆ పిల్ల హఠాత్తుగా అలా పరుగెత్తిపోవడం చూచి కొయ్యబారిపోయాడు. ఆ పిల్ల వెళ్ళినవైపే చూస్తూ అలాగే నుంచుండిపోయాడు. ఆ పిల్లమీద అంత కోపం ఎందుకొచ్చిందో కూడ తెలీని పరిస్థితిలో వుండిపోయాడు. శెట్టి అటువంటి అమాయక మూగపిల్లను తను అంతగట్టిగా కసురుకోనవసరంలేదు. అయినా కసురుకొన్నాడు. కసురుకోకపోతే మొండికి పడుతుందాయె. ఎట్లా? ఊ ! పీడాకారంపిల్ల, వదిలింది అంతేచాలు అని విసుక్కుంటు లోపలికి వెళ్ళాడు శెట్టి.

" అదేమిటండీ ! అట్లా వున్నారు ? " అంది శెట్టి భార్య అన్నం వడ్డిస్తూ. "ఆ ! ఎట్లావున్నాను ? అన్నాడు పరధ్యానంగా వున్న శెట్టి...." 'బాగానే వుంది ? నన్నడిగితే,' అని విసుక్కుంది భార్య.



ఓ! అదా! ఆ....అదే. ఆ బోణీపిల్లని అప్పివ్వను పొమ్మని కసిరాను. దాని కా పిల్ల కళ్లు నీళ్లుపెట్టుకొని పోయింది. నోరు లేదు కదూ అని గొణిగాడు. ఆ గొణుగుడు శెట్టికే వినిపించింది.

"ఆ పిల్లకు మీ దగ్గర మరీ అలుసు ఎక్కువ...ఎంత నోరులేకపోతే మాత్రం ఇంత అప్పు ఎవరిస్తారూ అంట. బోణీ! బోణీ! అని బాగా టోపీలో వేస్తోంది ఆ పిల్ల!........యిక యివ్వకండి" అంది. ఎందుకో శెట్టి తప్పుచేసిన వాడిలాగా దొంగతనం చేసినవాడిలాగా బాధపడుతూ భోజనం సహించక అవస్థపడ్డాడు. ఆ పిల్ల ముఖం దీనంగా తన వైపే చూస్తున్నట్టుంది. శెట్టి ఆ చూపులకు తట్టుకోలేక తనలో తాను దాక్కోడానికి ప్రయత్నించాడు. కాని దాక్కోడానికి చోటులేదు. తనలో వుండే మరొకమనిషి తన దొంగతనాన్ని పట్టేసినట్టు శెట్టి కంగారుపడటం మొదలెట్టాడు. తనలో హృదయం అనేదికూడా వుందని శెట్టి కింకా అప్పటికి తెలీదు. ఒకవేళ వుండినా ఆ హృదయం మాట్లాడుతుందని గాని, పోట్లాడుతుందని గాని, ఎరుగడు. ఒకవేళ మాట్లాడినా, పోట్లాడినా తన లోపలవుండే మనిషే కాబట్టి, తన వ్యాపారానికి లాభం వచ్చే సలహా చెప్పమని రాజీ పడతాడే కాని శెట్టి ఎప్పుడూ ఎవరితోనూ దెబ్బలాడడు. అసలు పోట్లాటలంటేనే శెట్టికి భయం.

హృదయం అందరిలోనూ వుంది. ఎప్పుడూ శకునపక్షిలాగా ఏదో చెబుతూనే వుంటుంది. మనిషిని శాయశక్తుల మంచి మార్గాన పెట్టటానికి ప్రయత్నిస్తూనే వుంటుంది. దాని నెత్తిమీద ఒక మొట్టికాయ వేసి నోరుమూసుకో అని హృదయం నోరు మూసి తమకుతాము మోసం చేసుకొనే వారు వున్నారు. హృదయం చెప్పినట్లు విని జీవితాన్ని సన్మార్గంలో తీసికెళ్ళేవారూ వున్నారు. అందులో మొదటిరకంవాడు శెట్టి. హృదయం నోరు మూస్తేనే గాని తన వ్యాపారం నడవదు మరి. ఒక్కొక్కప్పుడు నోరు మూసినా మాట్లాడేశక్తి హృదయాని కున్నదని శెట్టికి తెలీదు. నోరులేని పిల్లని కసురుకున్నావే దుర్మార్గుడా! ఎంత వ్యాపారం అయినా ఇంత అమానుషంగా ప్రవర్తిస్తావా అని శెట్టి హృదయం లోపలనుండి గోలపెడుతుంది. ఆ! కసురుకోకపోతే ఎన్నాళ్లు అప్పివ్వడం. "ఏదో నోరులేని పిల్లగదా అనీ, చితికిపోయిన కుటుంబం అనీ ఇన్నాళ్లూ చూశాను. అప్పు మూడునెల్లనుండి, అలాగే పేరుకుపోయింది. బకాయి పడితే తీర్చొద్దూ. వాళ్ళ మంచికే చెప్పాను. వడ్డీ లేనేలేదు. అసలైనా ఇవ్వకపోతే నా వ్యాపారం గతి ఏం గాను?" "నువ్వు నోరు మూసుకో" అని హృదయాన్ని చీవాట్లేశాడు శెట్టి. హృదయం బాధగా మూలిగింది.

"ఆదేమిటండీ! అన్నం తినకుండా ఆలోచిస్తున్నారూ?" అని శెట్టిభార్య దీర్ఘం తీసింది. శెట్టి వులిక్కిపడి.... "ఆ! ఆ! అదే, ఆ పీడకారం పిల్లను గురించే ఆలోచిస్తున్నా. ఏదోలాగ వుంది మనసు" అని గొణుగుతూ నాలుగు మెతుకులు కొరికి లేచాడు. 'ఆ' మీది మరీ విచిత్రంగా వుందే! ఆ పిల్లనుగురించి మనసు ఇంత పాడుచేసుకోటానికి ఏ మొచ్చిందీ అంట. ఇక అప్పివ్వకండి. రోగం కుదురుతుంది" అంటూ విస్తరి తీసుకొని, పెరట్లోకెళ్ళింది శెట్టి భార్య. తన హృదయం కంటే భార్యే మేలనిపించింది శెట్టికి. భార్య చెప్పిన మాటలు తన వ్యాపారానికీ తనకీ కూడా లాభదాయకంగా వున్నాయి. మరి తన నాసిహృదయానికి ఆ మాత్రం తెలివి లేకుండావుంది. తనకి నష్టం తీసుకురావడానికి ప్రయత్నించడమే కాకుండా తనకూ తన వ్యాపారానికి అడ్డు పడుతోంది వెధవ హృదయం. యిలాంటి చచ్చు హృదయం ఏ సన్యాసుల దగ్గిరనో, బైరాగుల దగ్గిరనో వుండాలికాని, తనలాటి వ్యాపారి దగ్గర వుండకూడదనుకున్నాడు. ఎప్పుడూ ఏదో లోపల గొణుగుతూనేవుంది. తను లెక్కచేయడంలేదు. కాబట్టే వ్యాపారానికి ఎలాటి నష్టమూ రాకుండా అంతవరకు జాగ్రత్తగా తీసుకరాగలిగాడు. పది రూపాయలతో ప్రారంభమైన వ్యాపారం పదివేల రూపాయలదాకా వుంది ప్రస్తుతం.

"అసలు నీవు చేసింది తప్పు కాకపోతే నాతో ఎందుకు దెబ్బలాడాలి?" అని సూటిగా అడిగింది హృదయం. అవును. అదీనిజమే. తను చేసింది మంచిపనే అయితే ఇందాకటినుంచీ తనెందు కింత బాధపడాలి. శెట్టి ఖంగారుపడ్డాడు. "నా ప్రశ్నకు సమాధానం చెప్పూ!" అని నిలదీసింది. ఇన్నాళ్ళూ మూలుగుతుంటే చీవాట్లు పెట్టి నోరుమూశాడు. యిప్పుడు తనమీదకు పోట్లాటకే తయారయిందే. శెట్టికి ఏంచెయ్యాలో తోచలేదు...పెళ్లాం వేధిస్తే వ్యాపారంలో వచ్చిన వడ్డీతో నగలు చేయించి పెట్టగలడు. పిల్లాడు మారాంచేస్తే బెల్లంముక్క చేతిలోపెట్టి బడికి పంపగలడు. మరి తనతో వుండి కనబడకుండా పోరాడే హృదయాన్ని ఏంచేయాలో తెలీక సతమతమయ్యాడు. ఇలా అయితే బంగారంలాటి తన వ్యాపారం ఏమయ్యేట్టు? తన హృదయం చెప్పినట్లు వినాల్సిందే! అమ్మో! కళ్లు గట్టిగా మూసుకొని పడుకొన్నాడు శెట్టి. హృదయం శెట్టిని అనేకవిధాల లొంగదీయడానికి ప్రయత్నించింది. "చూడూ! ఆపిల్ల ఎన్నోరోజులుగా భోజనంలేని ఆకుటుంబం కోసం నీ అంగడిచుట్టూ తిరుగుతుంది. వాళ్లనాన్నకేం కష్టంవచ్చి డబ్బు పంపలేదో! కష్టాలు నీకుమాత్రం రావూ? ఆ కుటుంబాన్ని పస్తుపెడితే నీకేగా ఆపాపం! నీకొడుకే అలా అన్నంలేకుండా వుంటే?" "ఛీ! ఛీ! నా కొడుకు అట్టా ఎందుకు అవుతాడు! పీడాకారం, మనసు సులుముకు తింటుంది" అని శెట్టికి నల్లులు కుట్టినట్లు పక్కకుదరక లేచి కూర్చున్నాడు. "నీవు

తప్పు వాళ్ళ కింకెవరు అప్పిస్తారు? ఆ నోరులేని పిల్లను నమ్మి ఎవరిస్తారు. ఏదైనా సహాయం చేయలేకపోతే వాళ్ళ ఉసురు నీ కుటుంబానికి తగులుతుంది" అని బెదిరించింది హృదయం—లేచి నుంచున్నాడు. అన్నట్లు ఆ పిల్ల ఇంటికి వెళ్ళిందో, లేదో? రోజూ ఇంటికివెళ్ళేదోవన పోలేదే! ఏమో! పీడాకారంపిల్ల ఎటెటితే తనేం చేస్తాడు! అయినా వూళ్లోవాళ్ళని గురించి తను మనసుతో ఘర్షణపడటం దేనికి? ఛా ఛా! ప్రొద్దున లేచినవేళ మంచిదికాదు. అనుకొని అటూ ఇటూ పచార్లు చేయడం మొదలెట్టాడు.

శెట్టిభార్యని కేకేశాడు. తనకు వత్తాసిగా ఏదయినా మాట్లాడుతూ వుంటుందని. ఒంటరిగా వుండే తన హృదయం స్వారీ చేస్తోంది. తనొక్కడే పోట్లాడటానికి భయంగా వుంది. శెట్టి భార్యకోసం వంటింట్లోకి వెళ్లాడు. లేదు. పక్కింటికి పెత్తనానికి వెళ్లింటుంది. హృదయంతో పోట్లాడి శెట్టి అలసిపోయాడు. ఇక తనకు శక్తిలేదు. విపరీతంగా దాహం వేసింది. నాలుగు లోటాల నీళ్లూ తాగేశాడు. చెయి జారి కంచులోటా కాలిమీద పడ్డది. "అబ్బా!" అంటూ శెట్టి అలాగే కూలబడ్డాడు. "ఇంతమాత్రానికే నీ మొద్దు శరీరం గాయపడిందని బాధపడుతున్నావే! సున్నితమైన ఆ పిల్ల మూగ హృదయం ఎంత బాధపడిందో ఆలోచించావా? అని ఎత్తిపొడిచింది హృదయం—"నా వృత్తి ధర్మం నే చేశాను. దానికి సాధిస్తావేంటే? అయినా నేనేం చేయాలో అఘోరించరాదూ. వూరికే నసుగుతూ ప్రాణాలు కొరుక్కుతినకపోతే" అని శెట్టి విసుక్కుంటూ రాజీకి దిగాడు హృదయంతో. "అదంతా నన్నడక్కు—నీ తప్పు నీవు తెలుసుకోవడం నాక్కావలసింది. ఆపైన నీ యిష్టం. ఆ పిల్లకి న్యాయం చెయ్యి. ఆ కుటుంబం పస్తు పడుకోకుండా చూడు. అంతే" అంది. శెట్టి విసుక్కుంటూ నసుక్కుంటూ కాలిబాధతో కుంటుకుంటూ పద్దు పుస్తకం తీశాడు. ప్రతినెలా ఆ పిల్ల డబ్బుతెచ్చియిచ్చినజమలువున్నాయి. మాట తప్పినపిల్ల కాదు. ఎన్నడూ ఏ సరకూ కొసరు అడిగిన పిల్ల కాదు. ఎంతోమంది మూగపిల్లలనుచూశాడుగాని ఈ పిల్ల అందరి మూగ పిల్లలవంటిది కాదు. ఎంతో మంచి పిల్ల. అందుకే మూడు నెల్లు డబ్బు ఇవ్వలేకపోయినా అప్పు పెట్టాడు. హృదయం శెట్టిని నెమ్మదిగా లొంగతీస్తోంది. అది శెట్టికి ఇబ్బందిగానే వుంది. మరొకవైపు వృత్తిధర్మం చేయిపుచ్చుకొని లాగుతోంది. తలపట్టు క్కూర్చొన్నాడు శెట్టి. 'ఆ పిల్ల మళ్లీ వస్తుందా? వస్తే బాగుండును. ఈ రోజు సరకులైనా యిచ్చి పంపుతాను. పీడకారప్పిల్ల ఎటు పోయిందో ఏమో!

ఒకప్పుడు కలవాళ్లింటి పిల్లలంతా ఇంతే! చింత చచ్చినా పులుసు చావదన్నట్లు... ఆస్తి పోయినా అహం చావదు. నోరు లేకపోయినా చచ్చేంత అభిమానం ఆపిల్లకి' అని అనుకొంటూ పద్దు పుస్తకం దస్కులో పడేసి, చెప్పు లేసుకొని బయలుదేరాడు. "ఎక్కడికి నాన్నా" అన్నాడు అంగట్లో కూర్చొన్న కొడుకు. "వస్తానురా ఇప్పుడే-కాస్సేపు అంగట్లోనే కూర్చో!" అని కొడుకు ఏదో చెబుతున్నా వినిపించుకోకుండా వెళ్లిపోయాడు. పక్కింటినుంచి వచ్చిన భార్య గొడుగు తెచ్చేలోగానే వీధి మలుపు తిరిగాడు. ఎన్నడూ శెట్టి యిలా తెగించి ఎండలో గొడుగు లేకుండా వీధిలోకి వెళ్లినవాడుకాడు. అయినా సిరికిం జెప్పడు—కదా! ఆ పిల్ల వుండే దెక్కడో ఎవరికి తెలుసు? 'అయినా ఫలానా మూగ పిల్ల ఇల్లెక్కడంటే ఎవరయినా చెపుతారు' అనుకొని అక్కడా అక్కడా విచారించి చివరికి మూగపిల్ల ఇల్లు కనుక్కున్నాడు.

అది ఇల్లుకాదు. పూరిపాక. లోపల ఎవరో మూలుగుతున్నారు పాకలో—'ఎవరు లోపల?' ఆ పిల్లను కేకేశాడు. ఎవరూ బయటికి రాలేదు. ఎండ నెత్తి మాడ్చేస్తోంది. 'తాను ఎన్నడూ రాలేదు' కాతాదార్ల కొంపలకు. పాపిష్టి మూగపిల్ల కాతాతో తన ఖర్మం ఇలా కాలింది' అనుకుంటూ బయట అరుగుమీద చతికిలపడ్డాడు. 'ఆ పిల్లను తిట్టరాదు' హృదయం హెచ్చరించింది.—"ఆ, తిట్టక ఏం చెయమంటావు" నా కొడుకును తిట్టుకోవడంలా-అట్టాగే!" అని రాజీ పడ్డాడు. ఛీ! ఛీ! పీడాకారం! ఈ ఎండలో ఎవరి కొంపముందో పడిగాపులు పట్టంతోటి శేట్లు చూస్తే ఏమనుకుంటారు? శెట్టి దురభిమానం వీపుమీద చరిచింది. దిగ్గున లేచి నుంచున్నాడు "ఎవరు లోపల?" అని కేకేశాడు. చేతి కర్ర సహాయంతో ఒక అవ్వ నెమ్మదిగా బయటికి వచ్చింది "ఎవరు నాయనా" అనుకుంటూ.

"ఆ మూగ పిల్ల ఎక్కడవ్వా?"

"ఓ హో— సెట్టిగారా! ఏం బాబూ పలక మీద వ్రాసి పంపానే. తీసుకురాలా?" "ఆ! తీసుకొచ్చింది. కాస్త ఆగమంటే ఆగకుండా పరుగెత్తింది. పలక క్రింద పడేసుకొని పగలకొట్టుకుంది పరుగెత్తడంలో. శెట్టి చెబుతున్నాడేగాని, లో లోన బాధతో మెలికలు తిరిగిపోయాడు. హృదయం శెట్టిని "ఛీ" అని అసహ్యించుకొంది. శెట్టి లోపల్లోపల హృదయం కాళ్లు పట్టుకున్నాడు. 'తప్పయింది. వృత్తి ధర్మం ప్రకారము నిజం చెప్పే ధైర్యం లేక అబద్ధం ఆడాను. ఈసారికి క్షమించు. నీ మాట విని నేను ఇంత కష్టపడుతున్నప్పుడు నేను పొరపాటున ఒకటిరెండు అబద్ధాలు ఆడినా, నీవు సరిపెట్టుకోకపోతే నా వ్యాపారం ఏంగాను చెప్పు. అహ! అసలు అబద్ధం చెప్పకుండా ఎట్టా ఉండటం. సరకు లివ్వలేదంటే అవ్వ తిట్టిపోస్తే! ఆ తిట్లన్నీ నాకూ, నా కొడుక్కు తగలవూ?' అవ్వ ఏడుస్తోంది "దాని నోరైనా వాయైనా ఆ పలకే. అదీ పగిలిపోయింది. అయ్యో దేవుడా! ఆ పిల్లను ఎందుకలా పుట్టించావు! ఈ కుటుంబాన్ని ఎందుకు ఇలా పరీక్షలపాలు చేస్తున్నావు తండ్రీ!- తిండి తిప్పలు లేకుండా నాలుగు రోజుల్నుంచీ కాలికి బలపం కట్టుకొని

తిరుగుతోంది మీ అంగడి చుట్టూ — పోనీ మీకేమైనా దయకలక్కూడదా ఆ నోరులేని పిల్ల ముఖం చూచైనా! ఇంతకూ మా గ్రహచారం. నెల నెలా డబ్బు పంపే కొండంత తండ్రి! ఆయన కెందుకింత జబ్బుచేయాలి! ఎలావుందో వెళ్ళి చూసే యోగ్యత లేకుండా చేశాడా దేవుడు! పూట తిండికే లేని మాకు రైలు చార్జీలు ఎక్కణ్ణించి వస్తాయి! పట్నం ఎలా వెళ్లగలం! అంతా ఆ దేవుడిదే భారం. యింతకీ ఈ పిల్ల ఏమయిందో!"


శెట్టి కళ్లుకూడా చెమ్మగిలాయి. అవ్వ చెప్పిందంతా విన్న హృదయం సెట్టిని కొంచెం కొంచెంగా కరగతీస్తోంది. "నా బిడ్డ ఎటు వెళ్లిందో చూశారా శెట్టిగారూ?" శెట్టికి అబద్ధంచెప్పే ధైర్యం లేకపోయింది. "నాకు తెలీదవ్వా" అన్నాడు పక్కకు తిరిగి కళ్లు తుడుచుకుంటూ. "అయ్యో నా తల్లీ! ఎక్కడికెళ్ళిందో ఎండలో? నోరైనా లేదే, ఏ తల్లినైనా అన్నం అని అడగటానికి! బచ్చలాకైనా వండిపెడదామని తెచ్చానే తల్లీ! ఎక్కడి కెళ్ళావే? మీ కష్టాలన్నీ చూడమని ఆ పాడుదేవుడు నా కాయుర్దాయం ఎక్కువిచ్చాడే" అని అవ్వఏడుస్తూ రాగాలు తీయడం మొదలెట్టింది. శెట్టికి మతిపోయినట్లయింది. తను దుర్మార్గుడు. చూస్తూ ఆ కుటుంబాన్ని క్షోభ పెడుతున్నాడు. వాళ్లు బచ్చలాకు తింటానికి తనే కారణం. హృదయం శెట్టిని అడకత్తెరలో పోకను నొక్కినట్లు నొక్కింది. తను చేతనయిన సహాయం వెంటనే చేయకపోతే తనకు ఆ కుటుంబం వుసురు తగులుతుంది. శెట్టి బయలుదేరాడు. ఆ పిల్ల ఎక్కడికి వెళ్లిందో. శెట్టి గొడుగులేకుండా ఎండలో వూరంతా గాలించాడు. తల దిమ్మెక్కింది. ఆ పిల్ల కనుపించక పోయేసరికి భయంతో శెట్టికి ముచ్చెమటలు పోశాయి.

అంగడికెళ్ళి సరకులన్ని పొట్లాలు కట్టి అవ్వకివ్వమని కొడుకునెత్తినపెట్టిపంపాడు. పెళ్లాం పోట్లాటకొచ్చింది. "నా కొడుకును ఆ దరిద్రం కొంపకు సరకులు నెత్తిన పంపుతావా" అని — శెట్టి ఏమీ మాట్లాడకుండా కొడుకును సరుకులిచ్చి పంపి, మళ్లీ పిల్లను వెతకడానికి బయలుదేరాడు.

తను ఎవరితోనూ మాట్లాడేస్థితిలో లేడు. మనసులో ఏదో తెలీనిబాధ గుండె పిండుతోంది. ఆ పిల్ల కనిపించిందాకా ఆ బాధ తగ్గదు — వూరంతా వెదికాడు. పిల్ల లాడుకొనేచోట్లంతా వెదికాడు...అనుమానంతో అక్కడక్కడ బావుల్లోకూడా వెదికాడు... శెట్టికి ఆ పిల్ల ఎక్కడా కనపళ్లేదు. తిరిగి తిరిగి అలసిపోయాడు. కొండమీద శివాలయంవేపు వెళ్ళాడు. మెట్లు ఎక్కలేక ఎక్కలేక ఎక్కి శివాలయం ఆవరణంలో వున్న మర్రిచెట్టుక్రింద కాస్సేపు నిలబడ్డాడు. పిల్ల అక్కడెందుకుంటుంది అనుకున్నాడు. రానేవచ్చానుగదా అని గర్భగుడి వైపు వెళ్ళాడు స్వామికి నమస్కరించడానికి. శెట్టి ప్రాణం లేచివచ్చింది. దేవుడే ప్రత్యక్షమయినట్లు భావించాడు. గర్భగుడి ముందు స్థంభానికి చేరగిలపడి వుంది. ఆ పిల్ల పలకముక్కలన్నీ ముందు పడివున్నాయి. శెట్టి గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. దగ్గరకెళ్ళి చూచాడు. పిల్ల స్పృహ తప్పి పడివుంది. శెట్టి ఖంగారు పడుతూ నాలుగుదిక్కులూ చూచాడు. అప్పుడే లోపలికి వస్తున్న పూజారి శివయ్య శెట్టిని చూచి "ఇదేమిటయ్యా ఎవరీ అమ్మాయ్!" అన్నాడు. "తర్వాత చెబుతాగాని కాస్త నీళ్లు కావాలి" అన్నాడు శెట్టి. శివయ్య దేవుడు అభిషేకతీర్థం తెచ్చి, పిల్ల ముఖం మీద చల్లాడు. పిల్ల నెమ్మదిగా కదిలింది. కాస్త తీర్థం గొంతులో పోశాక కళ్ళు తెరిచింది.

"అప్పుడప్పుడు ఈ మూగపిల్ల అవ్వతో గుడికి వస్తూ వుంటుంది — పాపం ఎందుకు ఈ వేళటప్పుడు వచ్చిందో" అన్నాడు శివయ్య. శెట్టి కళ్లు తుడుచుకొంటూ "నా మూలంగానే. నేను వాళ్ళకి అప్పివ్వనన్నాను. నాలుగు రోజులనుండీ పస్తు — అందుచేతనే పిల్ల స్పృహ తప్పింది." అన్నాడు. "అట్టాగా? పాపం ఆ మూగ పిల్ల చివరికి భగవంతుడిని ప్రార్థిస్తే తన ఆకలి తీరుస్తాడనుకుంది కాబోలు" అన్నాడు శివయ్య. "అంతే అంతే, నాలాటి దుర్మార్గుడిని అడిగేబదులు ఆ పిల్ల మూగహృదయంతో దేవుణ్ణే అడిగివుంటుంది" అంటూ శెట్టి బండికట్టించి పిల్లని ఇంటికితీసికెళ్లాడు. అవ్వ ఇంట్లోలేదు. పిల్లని వెదకడానికి వెళ్లి వుంటుంది. వెంటనే పొయ్యి వెలిగించాడు. శెట్టి కొడుకుచే పంపిన గింజలు వెచ్చాలు ఓమూల వున్నాయి. వెంటనే కాసినిగింజలు వేసి జావ తయారు చేశాడు శెట్టి. మూగ పిల్ల శెట్టి చేసేదంతా గ్రుడ్లప్పచెప్పి చూస్తూ వుండి పోయింది. ఒకమూల తల్లి, చంటి పిల్లలు మూసిన కన్ను తెరవకుండా పడివున్నారు. వాళ్ళందరికీ కూడా డాక్టరు తనే? మందు, గంజీ — లేక ఆ కుటుంబం అలా నేల కంటుకు పోయింది. మూగపిల్లకు గంజి తాగించాడు. పిల్ల కళ్ళల్లో ప్రాణం వచ్చింది. వెంటనే శెట్టి చేతిలో గంజి గిన్నె చంచా తీసుకొని ఆ పిల్ల — తల్లికి, చిన్నపిల్లలకి కాస్త కాస్త గంజి త్రాగించింది — వాళ్ళందరికి గంజి కడుపులోకి పోగానే కాస్త వూపిరి వచ్చింది — మూగపిల్ల ముఖం విప్పారింది. కృతజ్ఞతతో శెట్టి వైపు చూచింది. ఉక్కి మంచం మీద కూర్చున్న శెట్టి ఆదృశ్యాన్ని చూచాడు. తనా కుటుంబానికి ఏమౌతాడు? తా నెవరు? ఏమి టీ విచిత్రం. భగవంతుడు ఒక్క రోజులో ఎంత మార్పు తెచ్చాడు తనలో? అని శెట్టి ఆశ్చర్యపడుతూ వుంటే — అతని హృదయం సంతృప్తితో నిట్టూర్చింది —

అవ్వ వచ్చిందాకా వుండిపోదామనుకున్నాడు శెట్టి — కాని అవ్వ ఎంతకీ రాకపోయే సరికి వెదకడానికి బయలుదేరాడు. అవ్వే ఎదురొచ్చింది. గుండెలు బాదుకొంటూ, "నా బిడ్డ కనపడలేదు నాయనా" అంటూ "ఇదిగో అవ్వా! నేను తీసు


Sankar

కొచ్చాను" అన్నాడు. అవ్వ మూగపిల్లను కావిలించుకొంది. శెట్టి చేసినదంతా మూగ పిల్ల అవ్వతో తన భాషలో చెప్పింది— మీ ఋణం వేయి జన్మలకైనా తీర్చుకోలేం శెట్టిగారూ!" అంది అవ్వ కృతజ్ఞతతో. శెట్టి సిగ్గుపడ్డాడు — మూగ పిల్లను మామూలుగా సరుకులకు రోజూ వస్తూండమని చెప్పి. అవ్వతో వెళ్లొస్తానని చెప్పి వెళ్ళిపోయాడు:

ఏదో తాను చెప్పేసెయ్యా లనుకొంటున్న మాట గాలంలాగా శెట్టి మనసును పట్టి ఆపింది. "అవ్వా! యిందాక నేను అబద్ధం చెప్పాను. ఆ పలక నేనే ఎత్తి పడేసి పగలగొట్టాను" అని శెట్టి తలవంచుకొన్నాడు. "పోనీలే నాయనా" అంది అవ్వ. శెట్టి హృదయం ఆనందంగా నవ్వింది. శెట్టి ఇక అబద్ధాలు చెప్పడానికి సాహసించడు. శెట్టి ఇంటికి వెళ్లాడు. మర్నాడు మూగపిల్ల కోసం కొత్త పలక, బలపం కొని వుంచాడు. అంతేకాదు, ఆ పిల్లకు కొత్త బట్టలు ఇంట్లోవాళ్లకుకూడా బట్టలు కొని ఉంచాడు ఇచ్చి పంపడానికి — మూగ పిల్ల మర్నాడు పరుగెత్తుకుంటూ వచ్చింది — ఒళ్లో పండ్లు. తాంబూలం చిన్న నోట్ల కట్ట వున్నాయి. చేతిలో పలకకూడా వుంది. శెట్టి నిశ్చేష్టుడై మూగ పిల్లను చూస్తూ వుండిపోయాడు. పలకను చూపించింది, మూగ పిల్ల నవ్వుతూ. వాళ్ళనాన్నకు పెద్ద ఉద్యోగం అయిందట. వూరునుండి వచ్చాడట. కుటుంబాన్ని అందర్నీ పట్నం తీసుకెళ్ళడానికి — శెట్టి చేసిన సహాయానికి డబ్బు, తాంబూలం పెట్టి పంపాడు.

శెట్టికి ఆనందంతో కళ్ళల్లో నీళ్లు నిలచాయి. వాళ్ళ కష్టాలు గట్టెక్కాయి. మూగ పిల్ల హృదయాక్రందనం శివుడు విన్నాడు. శెట్టి మూగపిల్ల మూలంగా పూర్తిగా మానవు డయాడు. ఆ పిల్ల తనకు గురుతుల్యురాలు అనుకొన్నాడు శెట్టి. తను కొన్న కొత్త పలక చూపించాడు. మూగ పిల్ల కండ్లు సంతోషంతో జిగేలుమన్నాయి. శెట్టికి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. తను ఎంత అమానుషంగా ప్రవర్తించాడు! ఆ పిల్ల తెచ్చిన పళ్ళూ తాంబూలం డబ్బూ అంతా ఒక బుట్టలో పెట్టి కొడుకును పిలచి కొడుకు నెత్తిన పెట్టి తను ఆ పిల్ల చేయి పుచ్చుకొని బయలుదేరాడు. కొత్తబట్టలు, పలక బలపం ఒళ్ళో వేసుకొని శెట్టి, చేయి పట్టుకొని మూగపిల్ల హుషారుగా నడుస్తోంది.

మూగపిల్ల తండ్రి శెట్టికి నమస్కరించి "మా కుటుంబాన్ని కాపాడిన ధర్మాత్ముల"ని ఎంతో మెచ్చుకొన్నాడు. శెట్టికి జీవిత పరమార్థం ఆ క్షణంలో బోధపడింది. కేవలం వృత్తి—వృత్తి అని తను అంతకాలం చీకటిలో వుండిపోయాడు. చచ్చు హృదయం అని తనహృదయాన్ని తిట్టాడు. అన్నిటికీ వోర్చి తన హృదయం తనను వెలుగులోనికి లాగింది. ఇక తను చీకటిలోకి పోడు. జీవితంలో నలుగురికి సహాయపడని ఏ మానవుడి జీవితమైనా నిష్ఫలం అనుకొన్నాడు. మూగపిల్ల తెచ్చిన డబ్బు అంతా ఆ మూగపిల్లకే ఇచ్చాడు. అవ్వ వద్దన్నా వినకుండా. ఆ పిల్లకి బట్టలు కుట్టించమని ఇచ్చాడు. అంతేకాకుండ తన మెళ్ళో గౌరవంకోసం వేసు బంగారు గొలుసుకూడా తీసి ఆ పి[illegible] వేశాడు. ఆ మూగపిల్ల తల్లితండ్రులు, [illegible] అంతా నిశ్చేష్టులయ్యారు.

ఆ మర్నాడే మూగపిల్ల కుటుంబం అంతా పట్నం వెళ్లారు. ఆ రోజునుండి వ్యాపారంమీద జీవితంమీద శెట్టికి ఒక రకమయిన విరక్తి కలిగింది. రోజూ బోణీ చెయ్యడానికి మూగపిల్ల ఇకరాదు. మూగ పిల్లను శెట్టి మరచిపోలేకపోతున్నాడు. ఆ యీడు పిల్లలెవరైనా అంగడి వైపు వస్తే, ఒక పలక — బలపము యిచ్చి పంపుతూంటాడు — ఇష్టం వచ్చినపుడే అంగట్లో కూర్చొంటూ వుంటాడు. ఆ కూర్చొన్నపుడు ఎవరైనా బీదవాళ్ళు వస్తే డబ్బు లేకుండానే సరకులిచ్చి పంపుతున్నాడు. అది చూచి భార్య శెట్టిని అంగట్లో కూర్చోనివ్వకుండా—శెట్టికి పిచ్చి పట్టిందని పుకారు పెట్టింది. దానికి తగినట్లుగా శెట్టి తనలోతాను మాట్లాడుకోడం అప్పుడప్పుడు తనకు పిచ్చిపట్టిందనే ప్రచారాన్ని చూచి నవ్వడం, ఇదంతా చూచి నిజంగానే కనకాలుశెట్టికి పిచ్చి అని తీర్మానించింది ప్రపంచం. అందుకే ఎప్పుడూ ఒకమూల కూర్చొని పురాణం చదువుకుంటూంటాడు, కనకాలుశెట్టి బయటకొస్తే పోకిరి పిల్లలు రాళ్ళుకూడ వేయగలరని— కనకాలుశెట్టికి వొక్కటే కోరిక వుంది. జీవితంలో ఎప్పుడయినా ఒకసారి వెళ్ళి, మూగపిల్లను చూచి రావాలి—అంతే.

